

ఉపాధి కల్పించాలని ఆందోళన

ప్రజాశక్తి- పెదబయలు: మండలంలోని సీతగుంట పంచాయతీ లాకెపుట్టు గ్రామంలో కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఏకలవ్య పాఠశాలకు భూములిచ్చిన బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని ఆందోళన చేపట్టారు. ఈ మేరకు సోమవారం లకెపుట్టు గ్రామంలో 8 బాధిత కుటుంబాలు ప్రభుత్వానికి తమ ఆవేదనను వెలిబుచ్చారు. ఏకలవ్య పాఠశాల నిర్మాణానికి గత ప్రభుత్వం లాకేపుట్టు గ్రామస్తుల వద్ద నుండి 13 ఎకరాలు సేకరించి ఉద్యోగ ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చి నేటికీ హామీ నెరవేర్చలేదని బాధిత కుటుంబాలు తెలిపారు. ప్రభుత్వం నష్టపరిహారం ఉద్యోగం ఇచ్చి అడుకోవాలని కోరారు.



ఆందోళన చేస్తున్న బాధితులు



సీతారాం ఏచూరి చిత్ర పటానికి నివాళి అర్పిస్తున్న అప్పలనర్స, సురేంద్ర, తదితరులు

చిరస్మరణీయులు సీతారాం ఏచూరి

ప్రజాశక్తి పాడేరు:
ఎందరో ప్రపంచ మేధావుల ప్రశంసలతో ఖ్యాతి పొందిన మార్క్సిస్టు యోధుడు, బహు భాషా కోవిదుడు సీతారాం ఏచూరి జన హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి పోతారని సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శి పి.అప్పలనరస కొనియాడారు. స్థానిక పీఎంఆర్సి భవనంలో సోమవారం ఏచూరి సీతారాం సంతాప సభను నిర్వహించారు. ముందుగా ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సిపిఎం మండల కార్యదర్శి ఎల్.సుందర్రావు అధ్యక్షతన జరిగిన సభలో అప్పలనర్స మాట్లాడుతూ, ఏచూరి ప్రపంచ దేశాల్లో కీర్తిని, గుర్తింపును పొందారని కొనియాడారు. నిరంతరం ప్రజా సమస్యలపై పోరు సాగిస్తూ పాలకుల వైఫల్యాలను ఎండగట్టి దేశ రాజకీయాల్లో ఒక కీలక భూమి పోషించారని ఆయన ప్రశంసించారు. బిజెపి మతతత్వ విధానాలను వ్యతిరేకించారన్నారు. వరల్డ్ బ్యాంకు ఒప్పందాలు ఎంతో ప్రమాదకరమైనవని దేశంలో ప్రైవేటీకరణ, పెట్టుబడిదారీ వ్యవస్థ పెరగడంతో రైతు, కార్మిక, విద్యార్థి, పేదల స్థితిగతులు విచ్ఛిన్నమవుతాయని పలు సందర్భాల్లో ఆయన చాటి చెప్పారన్నారు. విశిష్టమైన శైలి, లక్షణాలు కలిగిన ఏచూరి ఎందరో మేధావులను ఆకట్టుకున్నారని చెప్పారు. నోబెల్ అవార్డు గ్రహీత అమర్త్యసేన్ వంటి వారు ఏచూరిని కీర్తించారన్నారు. జనం హృదయాలలో ఏచూరి శాశ్వతంగా నిలిచిపోతారని ఆయన కొనియాడారు.

సంతాప సభలో పలువురు వక్తలు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సభ్యులు కిల్లో సురేంద్ర మాట్లాడుతూ, సీతారాం ఏచూరి ప్రజల కోసమే తన జీవితాన్ని అంకితం చేశారన్నారు. పెద్ద కుటుంబంలో జన్మించి నిరంతరం పేదల అభ్యున్నతి కోసం పాటుపడిన వ్యక్తి ఏచూరి అని కొనియాడారు. ఎస్ఎఫ్ఐ విద్యార్థి ఉద్యమాల్లో తనదైన శైలిలో అనేక పోరాటాలతో దేశస్థాయిలో గుర్తింపు పొందారని తెలిపారు. పార్టీకి అత్యున్నత స్థాయిలో సేవలు అందించారన్నారు. గత యూపీఏ వన్ ప్రభుత్వంలో కామన్ మినిమం ప్రోగ్రాం రూపకల్పనకు ఏచూరి కీలక పాత్ర పోషించి గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధికి సంక్షేమానికి కృషి జరిపారని ఆయన కొనియాడారు. ఈ సంతాప సభలో సిపిఎం జిల్లా నాయకులు పాలికి లక్కు, బాలదేవ్, బహుభాషా వాలంటీర్ల సంఘం నాయకులు మర్రి చిట్టిబాబు, పాంగి శ్రీను, పాంగి కుమారి, వివిధ కార్మిక సంఘాల నాయకులు, విద్యార్థులు, మహిళా సంఘాల ప్రతినిధులు, ముఠా కార్మికులు పాల్గొన్నారు.

నేడు అరకులోయ మండల సమావేశం

ప్రజాశక్తి-అరకులోయ రూరల్:అరకులోయ మండల పరిషత్ సమావేశ మందిరంలో ఈనెల 17న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ రంజపల్లి ఉషారాణి అధ్యక్షతన నిర్వహించడం జరుగుతుందని మండల పరిషత్ అభివృద్ధి అధికారి చీపురుపల్లి వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్లు హాజరవు తున్నారన్నారు. వివిధ శాఖల మండల స్థాయి అధికారులు ఆయా శాఖలకు సంబందించిన పూర్తి వివరాలతో ఉదయం 10 గంటలకు సమావేశానికి విధిగా హాజరు కావాలన్నారు.

గ్రామ వాలంటీర్లను కొనసాగించాలి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:గ్రామ వాలంటీర్ల వ్యవస్థను కొనగించాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు బి విజయ్ కోరారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు వాలంటీర్ల వ్యవస్థను కొనసాగించి పది వేల వేతనం పెంచుతామని హామి ఇచ్చారని చెప్పారు. సీఎం ఇచ్చిన హామిని నిలబెట్టి వాలంటీర్లను విధుల్లో తీసుకోవాలని చెప్పారు. ఇటీవల సర్పంచ్ల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ గ్రామ వాలంటీర్ల వ్యవస్థను రద్దు చేసి వారికిచ్చే గౌరవ వేతనంను సర్పంచులు ఎంపిటిసిలకు ఇవ్వాలని ప్రకటించడంపై తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. వాలంటీర్లను కొనసాగిస్తే కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ ఫలాలను ప్రజల చెంతకు చేరే విధంగా కృషి చేస్తామని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి ఆమడ దూరంలో గుమ్మ

-మరమ్మతుకు నోచని రహదారి
-పునాది దశలో నిలిచిన సచివాలయ భవనం-అద్దెకొంపలో నిర్వహణ




రాళ్లు తేలిన పెద్దబిడ్డ. గమ్మ రహదారి



అద్దెకొంపలో సచివాలయ భవనం

ప్రజాశక్తి -అనంతగిరి:అభివృద్ధికి ఆమడ దూరంలో గుమ్మ పంచాయతీ మగ్గుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందని ద్రాక్షగా మిగిలాయి. గుమ్మ పంచాయతీలో సరైన రోడ్డు సౌకర్యం లేదు. సచివాలయం కేంద్రం, అంగన్వాడీ వంటి మౌలిక సదుపాయాలు లేక తీవ్ర అవస్థలకు గురవుతున్నారు.
గుమ్మ పంచాయతీలో 16 గిరిజన గ్రామాలు, 1600 మంది పైగా జనాభా ఉంది. సచివాలయం భవనం పనులు పూర్తి కాకపోవడంతో అద్దె భవనంలో విధులు కొనసాగిస్తున్నారు. సచివాలయం భవనం పనులు పునాది దశలోనే నిలిచి పోవడంతో గత్యంతరం లేక అద్దె కొంపల్లో సచివాలయ సిబ్బంది విధులు నిర్వహించవలసిన పరిస్థితి నెలకొంది
మాతా శిశు సంక్షేమ శాఖ ద్వారా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చిన్నారులు, గర్భిణీ, బాలింతలకు పౌష్టికాహారం అంగన్వాడీ కేంద్రం ద్వారా అందిస్తారు. అయినా అంగన్‌వాడీ కేంద్రానికి భవనం లేక సొంత ఇంటి వద్ద నిర్వహించి లబ్ధిదారులకు సరఫరా చేయవలసిన పరిస్థితి కొనసాగుతుంది,
ఏళ్ల గడుస్తున్నా పెద్దబిడ్డ, గుమ్మ రోడ్డు పనులు పూర్తి కాకపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు గిరిజనులు పడుతున్నారు. నిమ్మలపాడు మెయిన్ రోడ్డు చెరకుమడత నుండి కంటగింపురం, పెద్దబిడ్డ, నందులవలస మీదుగా కరవెసు, గమ్మ తదితర గ్రామాలకు నిర్మించిన రింగ్ రోడ్డు పనులు ఏళ్ళు గడుస్తున్నా సంబధిత కాంట్రాక్టర్ పనులు పూర్తి చేపట్టక పోవడంతో రాకపోకలకు ప్రయణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



పునాదిలో నిలిచిన సచివాలయ పనులు

క్రమశిక్షణ పేరుతో

గురుకుల కళాశాలలో వేధింపులు!

- విద్యార్థినులతో 200 వరకు గుంజీలు తీయించిన ప్రిన్సిపల్, పీడీ
- నడవలేని స్థితిలో ఆసుపత్రిలో చేరిన 64 మంది బాలికలు
- గిరిజన సంఘం నాయకుల చొరవతో వెలుగు చూసిన ఘటన
- ప్రిన్సిపల్, పీడీని బదిలీ చేయాలని డిమాండ్ చేస్తున్న విద్యార్థినులు, నేతలు



ఆసుపత్రిలో విద్యార్థులను పరామర్శిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పన కిరణ్, నాయకులు



విద్యార్థినిని అంబులెన్స్ వద్దకు ఎత్తుకొని తీసుకెళ్తున్న దృశ్యం



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీషాదేవి

ప్రజాశక్తి-రంపచోడవరం
స్థానిక గిరిజన సంక్షేమ గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో క్రమశిక్షణ పేరుతో ప్రిన్సిపల్ జి.ప్రసూన, పీడీ విద్యార్థినుల చేత కళాశాల 200 వరకు గుంజీలు తీయించిన సంఘటన ఎపి ఆదివాసీ గిరిజన సంఘం చొరవతో వెలుగు చూసింది. నడవలేని స్థితిలో ఉన్న సుమారు 64 మంది విద్యార్థినులను ఆసుపత్రిలో చేర్పించారు. ఈ సంఘటనకు సంబంధించి బాధిత విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు, ఎపి ఆదివాసీ గిరిజన సంఘం నేతలు తెలిపిన వివరాలు ప్రకారం...
కళాశాల ప్రిన్సిపాల్ ప్రసూన, పీడీ విద్యార్థినుల చేత 200 వరకు గుంజీలు తీయించడంతో నడవలేని స్థితిలో తమ పిల్లలు ఉన్నారని విద్యార్థినుల తల్లిదండ్రులు ఎపి ఆదివాసీ గిరిజన సంఘం నాయకులకు తెలియజేశారు. దీంతో గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు, జిల్లా నాయకులు మట్ల వాణిశ్రీ, సిరిమల్లె రెడ్డి, కంభం శాంతిరాజు సోమవారం ఉదయం కళాశాలకు వెళ్లారు. గిరిజన సంఘం నాయకులను, తల్లిదండ్రులను కళాశాలలోనికి వెళ్లడానికి ప్రిన్సిపల్ నిరాకరించారు. తమకు విద్యార్థినుల తల్లిదండ్రుల నుండి ఫిర్యాదు రావడంతో కళాశాలను సందర్శించడానికి వచ్చామని గిరిజన సంఘం నాయకులు ఎంత చెప్పినా ప్రిన్సిపల్ వినిపించుకోలేదు. తాము ఎటువంటి గుంజీలు తీయించలేదని వాదించారు. ఈ సమయంలో వారి మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. అనంతరం గిరిజన సంఘం నాయకులు విద్యార్థినులను కలసి మాట్లాడగా..., ప్రిన్సిపల్ ప్రతి చిన్న విషయానికి తమపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని, ఏ చిన్న తప్పు చేసినా 100 నుండి 200 వరకు గుంజీలు తీయిస్తున్నారని, గురువారం సాయంత్రం ఇలాగే పాలు తాగేందుకు ఆలస్యంగా వచ్చామని డైనింగ్ హాల్లోకి తీసుకెళ్లి ఒక్కొక్క విద్యార్థిని చేత 200 గుంజీలను తీయించారని, అప్పటి నుండి పలువురు విద్యార్థినులు నడవలేని పరిస్థితిలో ఉన్నట్లు విద్యార్థినులు తెలిపారు. వారిని ఆసుపత్రికి కూడా తీసుకెళ్లలేదని, తల్లిదండ్రులకు సమాచారం ఇస్తే మరింతగా వేధిస్తానని భయపెట్టారని చెప్పారు. ఆదివారం పిల్లలను కలిసినందుకు వచ్చిన తల్లిదండ్రులు తమ పిల్లల పరిస్థితిని చూసి చలించిపోయి గిరిజన సంఘం నాయకులు లోతా రామారావుకు ఫోన్ ద్వారా తెలియజేయడంతో విషయం బయటకొచ్చింది.
ఈ సందర్భంగా గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు మాట్లాడుతూ క్రమశిక్షణ పేరుతో గుంజీలు తీయించడంపై ప్రిన్సిపల్‌ను అడగ్గా గుంజీలు తీయించలేదని ఆమె వాదించాలని, తమను విద్యార్థులతో మాట్లాడేందుకు కూడా నిరాకరించారని పేర్కొన్నారు. చివరికి పిల్లలతో మాట్లాడితే వారంతా ముక్తకంఠంతో ప్రిన్సిపల్ గుంజీలు తీయించారని, తాము నడవలేని పరిస్థితిలో ఉన్నామని తెలియజేశారని చెప్పారు. ఐటీడీఏ కేంద్రానికి కూతవేటి దూరంలో ఉన్న కళాశాలలోనే పరిస్థితి ఇలా ఉంటే లోతట్టు ప్రాంతాలలోని కళాశాలలు, పాఠశాలల పరిస్థితి ఎలా ఉంటుందోనని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గురుకుల కళాశాల ప్రిన్సిపల్, పీడీలను తక్షణమే విధుల నుంచి తొలగించారని ఆయన డిమాండ్ చేశారు. సంఘం జిల్లా నాయకులు మట్ల వాణిశ్రీ మాట్లాడుతూ ప్రిన్సిపల్‌ను, పీడీని సస్పెండ్ చేసి, మరో కళాశాలకు బదిలీ చేయాలని, లేకుంటే విద్యార్థులపై మరింతగా కక్ష సాధింపు చర్యలకు పాల్పడతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. అనంతరం సుమారు 64 మంది విద్యార్థులను స్థానిక ఏరియా ఆసుపత్రిలో చికిత్స చేసేందుకు 108 వాహనంలో తరలించి వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ప్రిన్సిపల్‌తో మాట్లాడుతున్న గిరిజన సంఘం నేతలు లోతా, వాణిశ్రీ

విచారణకు ఐటిడిఎ పిఒ ఆదేశం

రంపచోడవరం గురుకుల బాలికల కళాశాలలో ప్రిన్సిపాల్ విద్యార్థులపై వేధింపులు చేస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థుల ఆందోళనలపై రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం వెంటనే స్పందించారు. దీనిపై విచారణకు రంపచోడవరం గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఇ.జాన్ రాజును ఎంక్వైరీ అధికారిగా నియమించినట్లు ఆయన తెలిపారు. ప్రిన్సిపాల్‌పై దర్యాప్తులో తప్పు అని రుజువైతే శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ప్రాజెక్ట్ అధికారి తెలిపారు.

విద్యార్థినులు పరామర్శించిన ఎమ్మెల్యే

రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గురుకుల కళాశాల విద్యార్థులను స్థానిక ఎమ్మెల్యే మిరియాల శిరీషా దేవి పరామర్శించారు. విద్యార్థినులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే వైద్యులను ఆదేశించారు. అనంతరం అక్కడ నుండి కళాశాలకు వెళ్లి అక్కడ విద్యార్థినులతో మాట్లాడారు. భయపడాల్సిన అవసరం లేదన్నారు. ప్రిన్సిపల్‌ను, పీడీపై వెంటనే విచారణ జరిపించాలని స్థానిక ఐటీడీఏ పీవో, డిడిలకు తెలియపర్చినట్లు చెప్పారు. వారు మంగళవారం వచ్చి విచారణ చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన పార్టీల నాయకులు పాల్గొన్నారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి కిరణ్ పరామర్శ

సీపీఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన్న కిరణ్ ఆసుపత్రిలో విద్యార్థినులను పరామర్శించారు. గురుకుల కళాశాల ఘటనపై విచారణ చేపట్టాలని, ప్రిన్సిపాల్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. గిరిజన హాస్టళ్లు, కళాశాలలో ఐటీడీఏ అధికారుల పర్యవేక్షణ లోపం వల్లే ఇటువంటి సంఘటనలు జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లోతా రామారావు, మట్ల వాణిశ్రీ, గిరిజన సంఘం నాయకులు సిరిమల్లి రెడ్డి, శాంతిరాజు తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో టెన్త్ విద్యార్థి మృతి

వర్షాలకు రోడ్డు కొట్టుకుపోవడంతో అంబులెన్స్ వెళ్లలేని స్థితి
సకాలంలో ఆసుపత్రికి తరలించ లేకపోవడంతో మృత్యువాత



మోహన్‌దాస్ (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి -సీలేరు
జీకే.వీధి మండలం సప్పర్ల బాలుర ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న గొల్లూరి మోహన్ దాస్ అనారోగ్యంతో మృతి చెందారు. కుటుంబ సభ్యుల తెలిపిన వివరాలు ప్రకారం... జికె.వీధి మండలం, జికె.వీధి పంచాయతీ పరిధి సంపంగి గొంది సమీపంలో ఉన్న ధోనిగుమ్మల గ్రామానికి చెందిన గొల్లూరి మోహన్‌దాస్ సప్పర్ల గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. మోహన్ దాస్‌కు జ్వరం రావడంతో నాలుగు రోజుల క్రితం స్వగ్రామం ధోనిగుమ్మలకు తీసుకెళ్లిపోయారు. ఆదివారం రాత్రి మోహన్ దాస్‌కు తీవ్ర జ్వరం రావడంతో ఆరోగ్య పరిస్థితి విషమించింది. దీంతో తల్లిదండ్రులు బంధువులు సహాయంతో జీకే.వీధి ప్రభుత్వాసుపత్రికి తరలించడానికి సిద్ధమయ్యారు. అయితే ఇటీవల వరదలకు రహదారి కొట్టుకుపోవడంతో వారి గ్రామానికి అంబులెన్స్ వెళ్లలేని పరిస్థితి నెలకొంది. గత్యంతరం లేక డోలికట్టి కాలినడకన మోహన్‌దాస్‌ను రెండు కిలోమీటర్లు దూరంలోని ప్రధాన రహదారికి చేర్చారు. అక్కడ అంబులెన్సులోకి ఎక్కిస్తుండగా విద్యార్థి మోహన్‌దాస్ మృతి చెందాడు. దీంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. గ్రామంలోకి అంబులెన్స్ వచ్చి ఉండి ఉంటే తమ మోహన్‌దాస్‌కు వైద్య సేవలు అంది ఉండేవని స్థానికులు చెబుతున్నారు. నెల రోజులు వ్యవధిలో సప్పర్ల ఆశ్రమ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు మృత్యువాత పడటంతో విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

భారీ వర్షాలకు ధ్వంసమైన

పంటలు, ఇళ్లకు నష్టపరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి -సీలేరు
ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జీకే వీధి మండలంలో పంట పొలాలు, ఇళ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయని, వాటికి నష్ట పరిహారం చెల్లించాలని సిపిఎం మండల కార్యదర్శి, గాలికొండ ఎంపీటీసీ అపరంజి బుజ్జిబాబు డిమాండ్ చేశారు. గుమ్మరేవుల పంచాయతీ మాదిగ మల్లు గ్రామంలో బాధితులతో సోమవారం ఎంపీటీసీ అంపరంగి బుజ్జిబాబు మాట్లాడి, వారికి జరిగిన నష్టంపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం బుజ్జిబాబు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ తక్షణమే అల్లురి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, ఐటిడిఓ పిఓ అభిషేక్, ఇతర శాఖల అధికారులు గుమ్మి రేవులు, దారకొండ, దుప్పిలివాడ పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో పర్యటించి నష్టాన్ని అంచనా వేసి పరిహారం చెల్లించాలని కోరారు. మాదిగ మల్లు, అన్నవరం గ్రామాల్లో నాలుగు కుటుంబాలకు చెందిన ఇల్లు పూర్తిగా వరదలకు కొట్టుకుపోయి ఆనవాళ్ళు లేకుండా పోయాయని, కట్టు బట్టలతో వారు మిగిలారని పేర్కొన్నారు. వరద విపత్తు వచ్చి ఏడు రోజులు గడుస్తున్నా పంటలు, పశునష్టాన్ని అంచనా వేయలేదన్నారు. రైతులు ఎంతో కష్టపడి ఓరి సామలు, రాగులు ఇతర దినుసు పంటలు వేసుకుంటే వరదలో పంటలు పూర్తిగా కొట్టుకుపోయి, ఆ భూములు పూర్తిగా బండ రాళ్లు మట్టి దెబ్బలతో పేరుకుపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. వరదల్లో నష్టపోయిన గిరిజన రైతులకు ఈక్రాప్ నమోదు చేసుకుంటేనే నష్టపరిహారం చెల్లిస్తామని ప్రభుత్వం చెప్పడం సమంజసం కాదన్నారు. ఈ క్రాప్‌తో సంబంధం లేకుండా పంట నష్టపోయిన ప్రతి రైతుకీ పరిహారం ప్రభుత్వం చెల్లించాలని డిమాండ్ చేశారు. మాదిగ మల్లు బాధితులకు నిత్యవసర సరుకులు అందజేయాలని, సచివాలయ వీఆర్వోల ద్వారా పంట నష్టం సర్వే చేయడం వలన ఎటువంటి ఉపయోగం లేదని, కలెక్టర్, ఐటిడిఎ పీవో స్పందించి పంట నష్టాన్ని అంచనా వేసి రైతులను తక్షణమే ఆర్థికంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు.



మాదిగమల్లులో వరద బాధితులతో మాట్లాడుతున్న సిపిఎం ఎంపిటిసి బుజ్జిబాబు

వీధి దీపాల ఏర్పాటు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:కించుమండ పంచాయతీ కేంద్రంలో వీధి దీపాలను పునరుద్ధరించడం జరిగిందని ఆ పంచాయతీ సర్పంచి చెల్లమ్మ తెలిపారు. సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, పంచాయతీ ఖాతాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో వీధి దీపాలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. పంచాయతీ పరిధి 11గ్రామాల్లో వీధి దీపాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి స్రవంతి, వార్డు సభ్యులు కామరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐ రమేష్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి -కోటవురట్ల:కోటవురట్ల ఎస్సైగా సోమవారం ఎస్.రమేష్ బాధ్యతలు చేపట్టారు. ఆయన అనకాపల్లి పట్టణ పోలీస్ స్టేషన్ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేసిన రమణయ్య అనకాపల్లికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఎస్సై రమేష్ మాట్లాడుతూ, శాంతి భద్రత పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ చూపుతానని తెలిపారు. ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడకుండా ప్రతి ఒక్కరూ సహకరించాలని ఈ సందర్భంగా కోరారు.

30 నుంచి సమ్మె చేపడతాం

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: జిల్లాలో వైద్య విభాగంలో పనిచేస్తున్న ఒప్పంద కార్మికుల సమస్యల పరిష్కారంపై ఈనెల 30 వ తేదీ నుండి సమ్మె చేస్తామని, ఇందులో భాగంగా జిల్లా కలెక్టర్లు, శాసనసభ్యులు, ఎంపీలకు వినతి పత్రాలు ఇస్తామని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు యల్.వి. రమణ సోమవారం విలేకరులకు తెలిపారు.ఏరియా ఆసుపత్రి వద్ద వైద్య విభాగ ఒప్పంద కార్మికుల సంఘం అధ్వర్యంలో కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ, కార్మికులకు గుత్తేదారులు సకాలంలో జీతాలు ఇవ్వలేదన్నారు. వేతనాలు ఎప్పుడు ఇస్తారని అడిగితే బిల్లులు రాలేదని, అందుకే ఇవ్వలేదని సాకులు చెబుతున్నారని పేర్కొన్నారు. దుర్భర పరిస్థితుల్లో వైద్య విభాగ ఒప్పంద కార్మికులు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై తక్షణం ప్రభుత్వం స్పందించి ఒప్పంద కార్మికులకు సంబంధించి గుత్తేదారు వ్యవస్థను రద్దు చేయాలని, పురపాలక కార్మికుల తరహాలో ఆఫ్కాస్ లో కలపాలని విజ్ఞప్తి చేశారు. కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పెదపూడి సత్యవతి, సోమేశ్వరరావు, పార్వతి, దుర్గా, లక్ష్మి, రాము, పద్మ, మల్లేశ్వరి, కమల, వరలక్ష్మి, లావణ్య, దేవి పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయంలో మరుగుదొడ్లు కరువు

ప్రజాశక్తి- కోటవురట్ల:మండలానికి దిశా నిర్దేశం చేసి ప్రజల సమస్యలను మండల సమస్యలను పరిష్కరించే మండల మెజిస్ట్రేట్ తహసిల్దార్ కార్యాలయంకు మరుగుదొడ్లు లేకపోవడంతో సిబ్బంది, కార్యాలయానికి వచ్చే ప్రజలు తీవ్ర అవస్థలు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. కార్యాలయం నిర్మించి సుమారు నాలుగు దశాబ్దాలు పూర్తయ్యింది. కార్యాలయం తొలినాళ్లలో నిర్మించిన మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఆనాడు మరుగుదొడ్లు నిర్మించారు. కానీ రన్నింగ్ వాటర్ లేక పోవడంతో నిరుపయోగంగా పడి ఉండేవి. ప్రస్తుతం పనిచేస్తున్న సిబ్బంది, ప్రధానంగా కార్యాలయానికి వచ్చే వృద్ధులు, మహిళలు, మహిళా సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఉన్నత స్థాయి అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి కార్యాలయానికి మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని పలువురు కోరుకుంటున్నారు.

విజేతలకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని సీతంపాలెం గ్రామంలో గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేసారు.గ్రామానికి చెందిన అల్లు సింహాద్రి జ్ఞాపకార్థం ఏ ఎస్ డి స్టార్ బాయ్స్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. నాయకులు గొర్ల నాగ అప్పలరాజు, గోవింద్, పెద్దల చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వికసించిన బ్రహ్మ కమలం

ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లిలోని ఓ ఇంటి వద్ద బ్రహ్మ కమలం పుష్పం వికసించింది. ఇంటి యజమాని దేవి మాట్లాడుతూ, సోమవారం తెల్లవారుజామున బ్రహ్మ కమలం పుష్పం వికసించిందని ఆనందం వ్యక్తం చేసింది .పలువురు బ్రహ్మ కమలం పుష్పం ను చూసేందుకు తరలి వచ్చారు .

విద్యార్థుల మరణాలపై విచారణ చేపట్టాలి : ఎస్ఎఫ్ఐ



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నేతలు

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి జిల్లా జికె.వీధి మండలం సప్పర్ల ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న టెన్త్ విద్యార్థి గొల్లూరి మోహన్ దాస్ (15) తన స్వగ్రామంలో అనారోగ్యంతో మరణించాడని, ఆర్.వి నగర్ బాలికల ఆశ్రమ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న జంపరంగి దార మల్లేశ్వరి వైజాగ్ కేజీహెచ్ లో చికిత్స పొందుతూ మరణించిందని, ఈ మరణాలపై విచారణ చేపట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కార్తీక్ శ్రీను, జీవన్ కృష్ణలు స్థానిక విలేకరులకు సోమవారం తెలిపారు. వైద్య సేవలు అందక విద్యార్థులు మృతి చెందుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, ఐటీడీఏ అధికారులు విద్యార్థుల మరణాలపై బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. వెంటనే విద్యార్థుల కుటుంబానికి ఎక్స్ గ్రేషియా రూ.25 లక్షల చొప్పున చెల్లించాలని డిమాండ్ చేశారు. మెను ప్రకారంగా భోజనం పెట్టకపోవడం, ఉడికి ఉడకని అన్నం పెట్టడం, రాష్ట్ర ప్రభుత్వం వైద్య శిబిరాన్ని నియమించకపోవడం, పిల్లలు తీసుకునే ఆహారంలో సరైన పౌష్టిక క్యాలరీస్ లేకపోవడం తదితర కారణాలతో విద్యార్థులు చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల మరణాలపై విచారణ జరిపించి, కుటుంబాలకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే వసతి గృహాల్లో వర్కర్స్, హెల్త్ అసిస్టెంట్లను, వాచ్మెన్లను నియమించాలన్నారు. రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ స్పందించి విద్యార్థుల మరణాలను అరికట్టేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సింహాద్రి, చిన్నారావు, గోపాల్ పాల్గొన్నారు.

కలుషిత ఆహార బాధితులకు పరిహారం ఏదీ?



మాట్లాడుతున్న బాధిత తల్లిదండ్రులు

ప్రజాశక్తి -హుకుంపేట:పరిహారం అందించాలని కలుషిత ఆహార బాధిత విద్యార్థులు తల్లిదండ్రులు కోరారు. వారి కథనం మేరకు... కోటవురట్లలోని అనాథ ఆశ్రమంలో ఫుడ్ పాయిజన్ జరిగిన విషయం విజితమే. ఈ ఆశ్రమ పాఠశాలలో ఉండి అల్లూరి జిల్లా హుకుంపేట మండలం తీగల వలస పంచాయతీకి చెందిన పిల్లలు పాంగి.అభిషేక్ (9.వ తరగతి) పాంగి సౌజన్య ఎం పి హెచ్ డబ్ల్యు (ఇంటర్ ద్వితీయ సంవత్సరం) కిల్లో సంజయ్ తేజ (6.వ తరగతి) పాంగి. వంశీ (4వ తరగతి) చదివారు. కలుషిత ఆహారం ఘటన తర్వాత గరుడాపల్లి, అమూరు గ్రామాల చెందిన విద్యార్థులను తల్లిదండ్రులు తీసుకుని వచ్చారు. పాడేరు ఏరియా ఆసుపత్రిలో మూడు రోజుల పాటు వైద్యం పొందారు. అనంతరం గ్రామానికి చేరుకున్నారు. నేటికి ప్రభుత్వం ప్రకటించిన నష్టపరిహారం అందకపోవడంతో ఈనెల 9న కలెక్టర్కు విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ అధికారుల నుంచి ఎటువంటి స్పందన లేకపోవడం మీడియా ముందుకు సోమవారం విద్యార్థులు తల్లిదండ్రులు వచ్చి తమ ఆవేదను వెలిబుచ్చారు. ప్రభుత్వం ప్రకటించిన నష్టపరిహారం చెల్లించి తమను ఆదుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు.

ఓజోన్ పరిరక్షణపై ర్యాలీ

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్: అంతర్జాతీయ ఓజోన్ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా గ్రీన్ క్లబ్ నర్సీపట్నం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీని ఆర్డీఓ జయరాం గ్రీన్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు డి గోపీనాథ్ సోమవారం ప్రారంభించారు. నర్సీపట్నం ఆర్డీఓ కార్యాలయం నుండి బొడ్డేపల్లి కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఓజోన్ ఆవశ్యకతను తెలియజేసి దాని పరిరక్షణకు అందరూ పాటుపడాలని వారు సూచించారు. గోపీనాథ్ ఆధ్వర్యంలో ఇటీవల మట్టి వినాయకుల పంపిణీ, ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని జరపడం సంతోషదాయకమని ఆర్డీఓ జయరాం తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు పలువురు చూపిస్తున్న చొరవ అభినందనీయమని కొనియాడారు. ఓజోన్ పరిరక్షణ అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందించారు. ప్రథమ, ద్వితీయ, కన్సోలేషన్ ప్రైజ్లను సీనియర్, జూనియర్ విభాగాలలో ఇచ్చారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొని పర్యావరణ పరిరక్షణకు నినాదాలతో హోరెత్తించారు. ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో ఏ.రమణమూర్తి, అప్పారావు, బివి నాయుడు, బంగారు అప్పలనాయుడు, వరహాలనాయుడు, జీవి.రమేష్, బాబీ మాస్టారు పాల్గొన్నారు.

సబ్ రిజిస్టార్ కార్యాలయంలో మార్పులు

ప్రజాశక్తి-కోటవురట్ల: స్థానిక సబ్ రిజిస్టార్ కార్యాల యంలో మార్పులు, చేర్పులు చోటుచేసుకున్నాయి. గతంలో కార్యాలయం రిజిస్టార్కు ఉండే ప్రత్యేక ఛాంబర్ ను ఎత్తయిన కుర్చీని తొలగించి సాధారణ పరిపాలన అధికారిగా అన్ని ప్రభుత్వ కార్యాలయ అధికారులు మాదిరిగా కూర్చునే విధంగానే ప్రభుత్వ ఆదేశాల మేరకు రిజిస్టర్ అధికారికి ఏర్పాట్లు చేశారు. గతంలో రిజిస్టర్ వద్ద క్రయవిక్రయాలు జరిగే సమయంలో నిలుచుని మాట్లాడవలసి వచ్చేది. ప్రస్తుతం దానికి స్వస్తి పలికి రిజిస్టర్ అధికారి ఎదురుగా కూర్చుని స్నేహపూర్వక వాతావరణంలో అధికారి అందుబాటులో ఉంటారని కార్యాలయ వర్గాలు తెలిపాయి.

నేరాలు ఘోరాలు



దగ్ధమవుతున్న ద్విచక్ర వాహనం

ద్విచక్ర వాహనం దగ్ధం

ప్రజాశక్తి-ఆనందపురం : ఆనందపురం ఫ్లైఓవర్ వద్ద సోమవారం ఉదయం పల్సర్ ద్విచక్రవాహనం దగ్ధమైంది. యువకుడు నవీన్ విశాఖ నుంచి సాలూరుకు ద్విచక్రవాహనంపై వెళుతుండగా ఫ్లైఓవర్ వద్ద ఆకస్మికంగా వాహనం నుంచి మంటలు వ్యాపించాయి. వెంటనే నవీన్ వాహనాన్ని నిలిపివేశాడు. స్థానికుల పోలీసులకు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపుచేశారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించి ఉంటాయని పోలీసులు భావిస్తున్నారు.

గిరిజన శిక్షణ సంస్థ విద్యార్థికి మెడికల్ సీటు



ప్రజాశక్తి -మధురవాడ : మారికవలసలోని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల శిక్షణా సంస్థలో శిక్షణ పొందుతున్న విద్యార్థులలో జి.గోపాలరావు 482 నీట్ స్కోర్, ఆలిండియా ర్యాంకు 3,686 (ఎస్టి కేటగిరిలో) సాధించినట్లు శిక్షణ సంస్థ ప్రిన్సిపల్ శివప్రసాద్ తెలిపారు. ఎంబిబిఎస్ -2024 కౌన్సెలింగ్లో విశాఖలోని గాయత్రీ విద్యా పరిషత్ మెడికల్ కళాశాలలో సీటు పొందారని పేర్కొన్నారు. హుకుంపేట మండలం ఈదుల గరువు గ్రామానికి చెందిన జి.ప్రసాదరావు, లేటు లక్ష్మిల కుమారుడు. అతి సాధారణమైన వ్యవసాయ కూలీల కుటుంబం నుంచి వచ్చాడు. నీట్ పరీక్షలో మంచి ర్యాంకును సాధించిన విద్యార్థిని అల్లూరి జిల్లా కలెక్టర్, ప్రాజెక్టు అధికారి అభినందించారు.

కార్నియా మార్పిడిలో ఎల్విపిఇఐ రికార్డు

ప్రజాశక్తి - ఆరిలోవ : ప్రపంచంలో ఏ సంస్థ కూడా సాధించని విధంగా అత్యధిక కార్నియా మార్పిడిలు చేసిన ఘనత ఎల్విపిఇఐలోని శాంతిలాల్ సంఘ్వీ కార్నియా ఇనిస్టిట్యూట్ సాధించిందని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ గుళ్లపల్లి ఎన్.రావు తెలిపారు. 1987లో స్థాపించినప్పటి నుంచి ఎల్విపిఇఐ 50 వేలకు పైగా కార్నియా మార్పిడిలు చేసిందని పేర్కొన్నారు. రోగులు తమపై ఉంచిన విశ్వాసం వల్ల ఈ బృహత్తర విజయం సాధ్యమైనట్టు తెలిపారు. దీంతో పాటు శోక సమయంలో కార్నియా దాతల కుటుంబాలు చూపిన ఉదారత వల్ల మాత్రమే సాధ్యమైనట్టు పేర్కొన్నారు. హైదరాబాద్, విశాఖపట్నం, భువనేశ్వర్, విజయవాడ నేత్ర నిధుల ద్వారా అత్యధికంగా కార్నియాలను సేకరించినట్లు తెలిపారు. వీటి ద్వారా ఏటా 12 వేలకు పైగా నేత్రదానాలను అందుకున్నట్టు తెలిపారు. వీటి ఫలితంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా రాష్ట్రాలలో కార్నియా మార్పిడి కోసం వెయిటింగ్ లిస్ట్ లేదని పేర్కొన్నారు. ఇంతటి విజయానికి డాక్టర్ జిఎన్.రావు దృఢ సంకల్పం, ప్రతిభా పాటవాలు ఎంతో దోహదపడ్డాయని ఎల్విపిఇఐ ఎగ్జిక్యూటివ్ అధ్యక్షులు డాక్టర్ శాంత్ గర్గ్ తెలిపారు.



నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న దాతలు

వరద బాధితులకు నిత్యావసరాల పంపిణీ

ప్రజాశక్తి -సీలేరు : ఇటీవల వచ్చిన భారీ వర్షాలు, వరదల కారణంగా నష్టపోయిన బాధిత గిరిజనులకు ఏపీ జెన్కో ఉద్యోగి ఎన్. వరప్రసాద్, స్థానిక జూనియర్ కళాశాల అధ్యాపకులు ఎ.సాయిరాం, పోస్ట్మాస్టర్ ఎస్.ప్రసాదరావు కలిసి నిత్యవసర సరుకులు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా గాలికొండ గ్రామస్తులు మాట్లాడుతూ దుప్పిలివాడ పంచాయతీ జొన్న మామిడి, గాలికొండ రెండు గ్రామాల్లో సుమారు 20 కుటుంబాలు కొండపైన నివాస గృహాలు ఏర్పాటు చేసుకొని నివసిస్తున్నామని, ఈ నెల 8న అర్ధరాత్రి చోటు చేసుకున్న వరదల కారణంగా కొండ చరియలు విరిగి పంట పొలాలు పూర్తిగా కొట్టుకుపోయని, ఇంటి లోపలకు కొట్టుకురావడంతో బట్టలు తిండిగింజలు పూర్తిగా తడిసి ముద్దయ్యాయని తెలిపారు. కల్వర్టు పూర్తిగా కొట్టుకుపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ గ్రామాలను సందర్శించి నష్టపరిహారాన్ని అంచనా వేశా రెండు గ్రామాలు ఆదుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

దారకొండ వర్తకులు పంపిణీ

దారకొండ పంచాయతీ పరిధి దారాపురంలో 22 కుటుంబాలకు, దార్లగొంది గ్రామంలో రెండు కుటుంబాలకు దారకొండ వర్తకులు సోమవారం ఒక్కొక్క కుటుంబానికి 25 కేజీల చెప్పున్న బియ్యం, పప్పులు, కారం, చింతపండు, వంటనూనె, కాయగూరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వర్తక సంఘ సభ్యులు అనుముల శెట్టి శ్రీనివాస్, చిన్నారి, కిషోర్, నరేష్, ఎర్ర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



చేతి బోరును ప్రారంభిస్తున్న ప్రతినిధులు

తాగునీటి సౌకర్యం కల్పించిన స్వచ్ఛంద సంస్థ

ప్రజాశక్తి-ఎటపాక : ఎటపాకలోని బాలికల ఆశ్రమ పాఠశాలలో కొంత కాలంగా ఉన్న నీటి సమస్యను అధికారుల చొరవతో సమారిటన ఫర్ ది నేషన్ అనే స్వచ్ఛంద సంస్థ పరిష్కారం చేసింది. బాలికల ఆశ్రమ పాఠశాల కూనవరం నుండి ఎటపాకకు 2022లో బదిలీ అయింది. అప్పటి నుంచి ఇక్కడి పాఠశాలలో సరైన నీటి సౌకర్యం లేదు. ఈ సమస్యను స్కూల్ వార్డెన్, హెచ్ఎంలు అల్లూరి జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీఓ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో అధికారులు ఎన్జీవో సమారిటన ఫర్ ది నేషన్ అనే సంస్థ దృష్టికి తీసుకెళ్లడంతో ఆ సంస్థ స్పందించి పాఠశాలలో హ్యాండ్ బోర్, వాటర్ ట్యాంక్ను 1.50 లక్షల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసింది. దీనిపై పాఠశాల విద్యార్థినులు, ఉపాధ్యాయులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సమారిటన ఫర్ ది నేషన్ సంస్థ అధినేత రామ్ కుమార్, టీం సభ్యులు, స్కూలు సిబ్బంది, సిఆర్పిఎఫ్ బెటాలియన్ కమాండర్ పాల్గొన్నారు.

పోర్టు స్థలాలు లీజుకే..

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

వైజాగ్ పోర్టులో ఉన్నతాధికార యంత్రాంగం కదలికలు చూస్తే పూర్తిగా పోర్టు స్థలాలన్నింటినీ లీజు పేరుతో ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టే దిశగానే ఉంటున్నాయి. ఈ మేరకు ఎక్కడెక్కడ తమ స్థలాలున్నాయో లెక్కలు తేల్చే పనిలో ఇప్పుడున్న పోర్టు యాజమాన్యం తలమునకలైనట్టు స్పష్టమవుతోంది. సుమారు 5700 ఎకరాలు పోర్టు చుట్టూరా స్థలాలున్నాయి. నగరంలోని గుండెకాయలాంటి ప్రాంతమైన శాలిగ్రాంపురంలో 17 ఎకరాల పోర్టు భూములను 30 ఏళ్ల పాటు రహేజా ఇనార్బిట్ మాల్కు కేవలం రూ.125 కోట్లకు గత ఛైర్మన్ హయాంలో పిపిపిలో ఇచ్చేశారు. తాజాగా పోర్టు స్పోర్ట్స్ కాంప్లెక్స్ (పోర్టు కళావాణి)ని నగరానికి చెందిన ఓ రాజకీయ నాయకునికి లీజు పేరుతో కట్టబెట్టేశారు. రూ.వందల కోట్ల విలువైన 17 ఎకరాలు సహా పోర్టు కళావాణిపై సర్వ హక్కులూ ప్రైవేట్ వ్యక్తులకు ఇప్పటికే దఖలు పడ్డాయి. నగర ప్రజలు, ఆఖరికి పోర్టు సాధారణ ఉద్యోగులు సైతం పోర్టు స్టేడియంలోకి డబ్బులు చెల్లించకుండా అడుగుపెట్టలేని దుస్థితి నెలకొంది. విశాఖ ప్రజలకు చెందాల్సిన భూములను 1933లో పోర్టు స్థాపించబడ్డాక తన ఖాతాలో వేసుకున్న పోర్టు తాజాగా లెక్కలు వేసుకుంటూ అమ్మకాలకు సిద్ధమైపోవడం చూస్తే ఈ ప్రాంత ప్రజల అమాయకత్వాన్ని సొమ్ము చేసుకోవడం మినహా మరొకటి కాదు. ఓడరేవు ప్రభుత్వానికి చెందినది అయినందున ప్రజల నుంచి అభ్యంతరాలుండేవి కావు. అయితే, పోర్టులనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన నాయకులు ప్రైవేట్ వ్యక్తులకు, పిపిపి కింద కట్టబెట్టాలని చూస్తున్న తరుణంలో ఈ భూములకు రెక్కలొస్తున్నాయి. ఈ నేపథ్యంలో సిపిఎం, సిఐటియు ప్రజా ఉద్యమానికి సిద్ధమవుతున్నాయి.

ప్రతిష్టాత్మక పోర్టు ఆసుపత్రికి ఎసరు ?

పోర్టుకుగల వేల ఎకరాల ఆస్తులన్నీ నగరం నడిబొడ్డున, పోర్టు పరిసరాల చుట్టూనే ఉన్నాయి. అలాంటి వాటిలో విశాఖ పోర్టు గోల్డెన్ జూబ్లీ ఆసుపత్రి అత్యంత కీలకమైనది. దీన్ని పిపిపి పేరుతో ఆపరేట్ చెయ్యాలని పోర్టు పిపిపి అధికార యంత్రాంగం, యాజమాన్యం నిర్ణయించాయి. ఆ దిశగా తీవ్రస్థాయిలో పావులు కదుపుతున్నారు. ప్రజా ఆందోళనలు వస్తున్నా వీరు వెనక్కి తగ్గడం లేదు. 1984లో 150 పడకల సామర్థ్యంతో దీన్ని నిర్మించారు. ప్రస్తుతం 80 పడకలతో సమర్థవంతంగా పోర్టు అండ్ డాక్ అధికారులకు, ఉద్యోగులకు, కార్మికులకు, రిటైర్డ్ ఉద్యోగులకు, పూల్ కళాశీలకు, కార్గో హ్యాండ్లింగ్ డివిజన్ కార్మికులు, సిఐఎస్ఎఫ్ వాళ్లకు సుమారు 35 వేల కుటుంబాలకు ఉన్న ఫలంగా పోర్టు ఆసుపత్రి వైద్య సేవలందిస్తోంది. పోర్టుకుగల ఆస్తులు లెక్కిస్తే రూ.వేలు, లక్షల కోట్లే బహిరంగ మార్కెట్లో ఉంటాయి. మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి పేరుతో పోర్టు యాజమాన్యం తాజాగా రూ.250 కోట్లతో పిపిపిలో పెట్టేసే నిర్ణయం చేసేసింది. ఇది భావితరాలకు, పోర్టు ఉద్యోగులు, కార్మికులకు శరాఘాతంగా పరిణమించనుంది. ఆసుపత్రి ప్రారంభంలో ఇప్పుడున్న సిబ్బంది, ఉద్యోగులు, కార్మికులకు సేవలందించే అవకాశాలున్నా క్రమంగా పిపిపి ఆపరేటర్లు కొనసాగించరు. దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నివేదికలు వెళ్లాయి. ఆసుపత్రి కాంప్లెక్స్ ప్రస్తుతం 1.2 ఎకరాల విస్తీర్ణం. ఆసుపత్రి పక్కన మరో ఐదు ఎకరాల వరకూ ఉంది. ఇదంతా ఇచ్చేస్తున్నారు.

లెక్కలు తేల్చేదిశగా యాజమాన్యం
ప్రజా ప్రతినిధులు ఏం చేస్తున్నారు ?

ప్రజాప్రతినిధుల సమావేశాల్లో ఏం చర్చించారు?

తాజాగా వైజాగ్ పోర్టుపై గత నెలలో విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పోర్టు అధికారులతో ప్రత్యేక సమావేశమై పోర్టు నుంచి కాలుష్యం తగ్గించే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మూడు రోజుల క్రితం విశాఖపట్నం ఎంపి శ్రీభరత్ కూడా అధికారులతో సమావేశం నిర్వహించి విశాఖ నగరాభివృద్ధికి, అలాగే కాలుష్య రహితంగా మార్చడానికి చర్యలు తీసుకోవాలంటూ ఆదేశించారు. మరోవైపు పోర్టు వర్గాల్లో 'ఆస్తులన్నీ పిపిపిలో జారిపోతుంటే గంటలు తరబడి అధికారులతో లోపల సమావేశమైన ఇద్దరు నాయకులూ బయటకొచ్చి కాలుష్యం గురించి మీడియా వద్ద ప్రస్తావించడం ఏమిటి?.. పోర్టు ఆస్తులను రక్షించాలి కదా' అంటూ చర్చ సాగుతోంది.

అమెజాన్ ఫెస్టివ్ బాక్స్ ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పండగ సీజన్ ఆరంభమవడంతో అమెజాన్ ఇండియా ఫెస్టివ్ బాక్స్ పేరిట ప్రచార క్యాంపెయిన్ను సోమవారం విశాఖపట్నంలో ప్రారంభించింది. ఈ మేరకు నగరంలోని సిఎంఆర్ సెంటర్లో ఒక బాక్స్ను అందుబాటులో ఉంచి ప్రజల అవసరాలను తెలుసుకునే ప్రయత్నం ఆరంభించింది. అనంతరం బీచ్ రోడ్లోని నోవాటల్ హోటల్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అమెజాన్ ఇండియా అవుట్ డోర్స్, కిచెన్ హోం విభాగ డైరెక్టర్ కెఎన్.శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రతి త్రైమాసికంలో 40 శాతం వృద్ధి సాధిస్తున్నామని, విశాఖ ప్రజలు సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన గృహోపకరణాల కొనుగోలుకు ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నారని తెలిపారు.

వలస కార్మికుడు ఆత్మహత్య

ప్రజాశక్తి -కొయ్యూరు : జాతీయ రహదారి పనుల నిమిత్తం అస్సాం నుండి వచ్చిన వలస కార్మికుడు ప్రేమ విఫలమై ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని బట్టపనులు గ్రామం వద్ద చోటుచేసుకుంది. కొయ్యూరు కొయ్యూరు ఎస్సై రామకృష్ణ తెలిపిన వివరాలు ప్రకారం... అస్సాం రాష్ట్రానికి చెందిన నజీబుల్ హుస్సేన్ అనే వ్యక్తి జాతీయ రహదారి పనుల నిమిత్తం మే నెలలో ఇక్కడికి వచ్చాడు. ఆదివారం సాయంత్రం బట్ట పనులు గ్రామం దగ్గర జేడి తోటలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దీనిపై పోలీసులకు అందిన సమాచారం మేరకు కొయ్యూరు పోలీసులు సంఘటనా స్థలాన్ని సందర్శించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. ప్రేమించిన అమ్మాయి తన ప్రేమను అంగీకరించకపోవడంతో నజీబుల్ హుస్సేన్ ఆత్మహత్య చేసుకున్నట్లు విచారణ తేలినట్లు కొయ్యూరు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.



మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి సత్యనారాయణ మూర్తి

వరద బాధితులను ఆదుకోవాలి : సిపిఐ

ప్రజాశక్తి - సీలేరు : ఇటీవల వరద బీభత్సానికి పంట పొలాలు, ఇల్లు నష్టపోయిన బాధితులకు పరిహారం చెల్లించి ఆదుకోవాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి, ఏపీ మహిళా సమైక్య రాష్ట్ర అధ్యక్షులు అత్తిల విమల ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జీకే వీధి మండలం దారకొండ, గుమ్మిరేవులు పంచాయతీల్లో వరద బాధితులకు సోమవారం వారు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తక్షణమే ప్రభుత్వం స్పందించి నష్టాన్ని పూర్తిగా సర్వే చేసి రైతులకు తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని కోరారు. మారుమూల గిరిజన గ్రామాల్లో భారీ వర్షాలకు రహదారులు పూర్తిగా దెబ్బ తినడంతో బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయని వాపోయారు. అయినా అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. భారీ వర్షాలకు దారాపురం గ్రామంలో 21 కుటుంబాలు ఇల్లు పూర్తిగా దెబ్బతిన్నట్లు, వందలాది ఎకరాల్లో పంట పొలాలు నామరూపాలు లేకుండా కొట్టుకుపోయినట్లు తమ పరిశీలనలో తెలిసిందని చెప్పారు. ఇంత విపత్తు జరిగినా ప్రభుత్వం నుండి స్పందన లేకపోవడం విచారకరమన్నారు. ఈ సందర్భంగా బాధితులకు సిపిఐ తరుపున బియ్యం, ఇతర నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సుంకర విష్ణుమూర్తి, కిలో భగవాన్, మాజీ ఎంపీటీసీ గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన వంతెన పనులు

ప్రజాశక్తి - సీలేరు : జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశాల మేరకు జికె.వీధి మండలం గుమ్మిరేవుల పంచాయతీ, చోడురాయి వంతెన అప్రోచ్ పనులు యుద్ధ ప్రాతిపదికిన నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి వి.శ్రీనివాస్ వెల్లడించారు. సోమవారం ఆయన పనులను పరిశీలించి అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వంతెన ఇరువైపులా అప్రోచ్ కొట్టుకుపోయిందని, రాకపోకల స్తంభించిపోయాయని తెలిపారు. ఈ క్రమంలోనే కలెక్టర్ ఆదేశాల మేరకు యుద్ధ ప్రాతిపదిక పనులు చేపట్టి వేగవంతం చేస్తున్నామని తెలిపారు. చీడిగుంట, తోకరాయి, కమ్మరితోట గ్రామాల్లో బోరువావులు పైపులైన్లు మరమ్మతులు పనులు పూర్తి చేయడంతో ఆయా గ్రామానికి మంచినీటి సమస్య తొలగిందని చెప్పారు. కార్యక్రమంలో పిఆర్ఐ డిఇ కళ్యాణ్ కుమార్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ రాంబాబు, గుమ్మిరేవుల సర్పంచ్ ముర్ల కమలమ్మ, మాజీ సర్పంచ్ బాబురావు, మార్క్ రాజు, దారకొండ సర్పంచ్ ఎన్. రాజు, ఎంపీటీసీ ఎం.రామన్న, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి వైసిపి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కూనవరం : మండలంలోని మర్రిగూడెం గ్రామానికి చెందిన ఆవుల వెంకటరామరావు ఇటీవల విద్యుదాఘాతానికి మృతి చెందగా, ఆయన కుటుంబానికి వైసిపి నాయకులు రూ.15వేలు ఆర్థిక సాయం సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు మాట్లాడుతూ బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు ఆవుల మరియదాసు, దీకొండ గంగాధర్, కొమ్మని మోహన్ రావు, చిలకం హరినాద్ బాబు, కొమ్మని సునీత, మాజీ సర్పంచ్. చిచ్చడి మంజుల, పరిటాల పద్మావత, కట్టిబోయిన వెంకటేశ్వరరావు, దాసరి నాగరాజు, బాగి నవీన్, నాస్కూరి వెంకటాద్రి, అపక వెంకట రామారావు, కంటే ప్రతాప్, కొమ్మాని వీర్రాజు, బత్తుల వెంకటేష్, సంగుల సురేష్, చిలకం లక్ష్మణరావు, మున్నాఫ్ పాల్గొన్నారు. బాధిత కుటుంబానికి చూచెరేవుల గూడెం గ్రామానికి చెందిన నోముల సత్యనారాయణ టెంట్ హౌస్, అందజేశారు.